విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి: చేదూరి

విశాలాంధ్ర-పుల్లలచెరువు : దివ్యాంగులకు రూ.6వేలు పింఛన్ ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నియోజక వర్గ అధ్యక్షుడు చేదూరి సుధాకర్ డిమాండ్ చేశారు. మండలంలో సోమవారం జరిగిన దివ్యాంగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగనన్న కాలనీలో వారికి పక్కా గృ హాలు నిర్మిచాలని, ఒంటరి దివ్యాంగులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని, మోటార్ స్కూటర్లు, బ్యాటరీ ట్రై సైకిల్ ఇవ్వాలని, చేతి కర్రలు, వినికిడి యంత్రాలు మంజూరు చేయాలని ఆయన కోరారు. రిజర్వేషన్‌ల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని, ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులుగా దోరడ్ల యేసోబు (రెంటపల్లిగ్రామం°) ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బి దేవదాసు, కార్యదర్శి అర్ ఏసోబు సహాయ కార్యదర్శి కె.బలకోటి కోశాధికారి పి. వేకటేస్వరారెడ్డి సభ్యులుగా పి జక్రయ్య, యం.మేరీ, కె ప్రభుదాస్, బి.యాకోబు, కె. ఏసుదానం ఎన్నికయ్యారు. బి. చిన్నయ్య, కె కోటేశ్వరావు, పోలేపల్లి పెద్ద పాలంకయ్య, అర్‌డిటి డికె చెన్నయ్య పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని వీ జ్యోతి అన్నారు. ఉల్లగల్లు డాక్టర్ వైఎస్ఆర్ క్లినిక్‌లో సోమవారం 104 వాహనం ద్వారా వైద్య సేవలు నిర్వహించారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటమే లక్ష్యమన్నారు. అనంతరం కొత్తూరు ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి చిన్నారులకు వైద్య సేవలు అందించారు. మొత్తం 63 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్వైజర్ కన్యాకుమారి, ఏఎన్ఎం జమీలా బేగం, నీరజ, ఎంఎల్ హెచ్ పి శ్రీ లలిత , 104 డీఈవో ప్రసాద్, వినోద్, సిహెచ్ దిలీప్, ఆషా పాల్గొన్నారు.

రైతు భరోసాకు ఈకేవైసీ తప్పనిసరి

విశాలాంధ్ర-తాళ్లూరు : రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని ఏవో బి ప్రసాద్‌రావు అన్నారు. వెలుగువారిపాలెం రైతు భరోసా కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ నగదు జమ కాని లబ్ధిదారులు వెంటనే ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు మండలంలో 8325 మంది రైతులకు రూ. కోటి 66 లక్షల 50లు జమ చేయబడిందని అన్నారు. రెండు వేలకు పైబడి రైతులు ఈ కేవైసీ పూర్తి చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారి రమణారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సుష్మ సుల్తానా, వి ఏ హెచ్ భారతి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చదువును ఓ ఫ్యాషన్‌గా తీసుకోవాలి

విశాలాంధ్ర-చీరాల : విద్యార్థులు సినిమాలు, క్రికెట్ వంటి వాటితో పాటు చదువును కూడా ఫ్యాషన్‌గా తీసుకోవాలని ప్రైమ్ సాఫ్ట్ టెక్నాలజీస్ సీఈవో కొలిశెట్టి ప్రసాద్ అన్నారు. స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో సాఫ్ట్వేర్ రంగంలో ప్రస్తుత పరిస్థితులు, ఉద్యోగాలను సొంతం చేసుకోవడానికి కావలసిన నైపుణ్యత అనే అంశంపై సోమవారం జరిగిన సెమినార్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సినిమాలు, క్రికెట్ ఉల్లాసాన్నిస్తే చదువు జీవితాన్నిస్తుందని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ లో అన్ని గ్రూపులు సమానమేనని కావలసింది మనలో నైపుణ్యమేనన్నారు. కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంచుకోవడం చాలా ముఖ్యమన్నారు. చిన్న చిన్న అంశాలను తీసుకొని స్నేహితులతో వాటిని ఇంగ్లీషులో మాట్లాడుతూ సాధన చేస్తే ఇంగ్లీషు త్వరగా రావడంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా పెరుగుతాయని చెప్పారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి రవికుమార్ మాట్లాడుతూ ప్రసాద్ వేటపాలెం వంటి గ్రామీణ ప్రాంతంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థానానికి ఎదిగారాన్నారు. సొంతగా సాఫ్ట్వేర్ కంపెనీని నడపడమే కాకుండా ఎంతో మందికి ఉపాధిని చూపుతున్నారని కొనియాడారు. ప్లేస్మెంట్ ఆఫీసర్ షేక్ బాజీ సాహేద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

విశాలాంధ్ర-పామూరు : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన, క్రమశిక్షణతో కూడిన విద్యను, విజ్ఞానమును పేద బడుగు బలహీన వర్గానికి అందించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యం అని ఎంపీపీ గంగసాని లక్ష్మి హుస్సేన్‌రెడ్డి చెప్పారు. కంబాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రెండో విడత నాడు నేడులో భాగంగా రూ.62 లక్షలు మంజూరయ్యాయి. అదనపు గదుల నిర్మాణమునకు సోమవారం ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుస్సేన్ రెడ్డి భూమి పూజ చేశారు. ప్రధానోపాధ్యాయులు కాలేశావలి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ చిన్నారులకు యూనిఫామ్, పుస్తకాలు, బ్యాగు, బెల్టు, టై , షూ తో పాటు జగనన్న గోరుము ద్వారా రుచి కరమైన భోజనమును అందిస్తూ బడికి పంపించే తల్లులకు అమ్మ ఒడి పథకం ద్వారా నగదు కూడా ఇవ్వడం జరుగుచున్నదన్నారు. అనంతరం రజాసాహెబ్ పేటలో 18 లక్షలతో ఇంటింటికి కులాయి పైపులైన్ పనులను ప్రారంభించారు. జడ్పీటిసి చప్పిడి సుబ్బయ్య, సర్పంచ్ నీలం రమణమ్మ, షేక్ నాయబ్ రసూల్, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, పిచ్చల మాలకొండారెడ్డి, పిచ్చాల తిరుపతిరెడ్డి, కొల్లా నారాయణ, ఉప సర్పంచ్ యరగొర్ల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

10న టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం

విశాలాంధ్ర-ఒంగోలు: స్థానికార్లమెంట్ కార్యాలయంలో ఈనెల 10 న టిడిపి ఉమ్మడి ప్రకాశం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరుగుతుందని ఆ పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ తెలిపారు. జోనల్ ఇంచార్జ్, పార్లమెంట్ పరిశీలకులు, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జ్ లు, పార్టీ పరిశీలకులు, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలతో జరుగుతుంది అని నూకసాని తెలిపారు. 12 నియోజకవర్గాలు సమన్వయంగా పనిచేసే విధానంపై చర్చ జరుగుతుంది అని నూకసాని బాలాజీ తెలియజేశారు.

మంత్రి సురేష్‌కు సర్పంచ్ పరామర్శ



విశాలాంధ్ర-పెద్దదోర్నాల : రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను సోమవారం పెద్దదోర్నాల సర్పంచ్ చిత్తూరి హారిక,కరుణాకర్, బొమ్మలాపురం హెడ్మాస్టర్ కిరణ్ కుమార్ సోమవారం పరామర్శించారు. మంత్రి హైదరాబాదులో మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకుని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. త్వరలో కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఆశ్రయ వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-పర్చూరు: మండలంలోని నూతలపాడు గ్రామంలోని ఆశ్రయ వృద్ధాశ్ర మంలో సోమవారం తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన పొన్నాడ విశ్వనాథం జ్ఞాపకార్థం మనవడు కిరణ్ వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి విందు భోజనం ఏర్పాటు చేశారు. నిర్వాహకులు భవనం శ్రీనివాసరెడ్డి, జయలక్ష్మి పొన్నాడ కిరణ, సాధ్య ఫౌండేషన్ నిర్వాహకులు విజయ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పతనావస్థకు పెట్టుబడిదారీవ్యవస్థ: ఓబులేసు

ఘనంగా సైంటిఫిక్ సోషలిస్ట్ స్టడీ సర్కిల్ ప్రారంభం

విశాలాంధ్ర-ఒంగోలు: స్థానిక మల్లయ్య లింగం భవనంలో సైంటిఫిక్ సోషలిస్ట్ స్టడీ సర్కిల్ ను మార్క్సిస్టు తత్వశాస్త్ర, అర్థశాస్త్ర విశ్లేషకులు జి తులసేంద్ర సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ విప్లవ 105వ వార్షికోత్సవం రోజున సైంటిఫిక్ సోషలిస్ట్ స్టడీ సర్కిల్ ను ప్రారంభించడం మంచి పరిణామం అన్నారు. స్టడీ సర్కిల్ ద్వారా నూతన తరానికి అక్టోబర్ విప్లవం స్ఫూర్తితో మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడంతో పాటు భావితరాలకు అందించాలన్నారు. జిల్లాలోని విద్యార్థులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు సైంటిఫిక్ సోషలిస్టు స్టడీ సర్కిల్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మరో ముఖ్య అతిథి, ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జీ ఓబులేసు మాట్లాడుతూ ప్రపంచంలో మొట్టమొదటిసారిగా మనిషిని మనిషి దోచుకునే పద్ధతి నుండి విముక్తి కలిగించింది రష్యాలో 1917లో జరిగిన అక్టోబర్ విప్లవం ద్వారానే అన్నారు. చరిత్రలో ఈ విప్లవం మొదటిసారి దోపిడీ, వలస వాదాన్ని, సామ్రాజ్యవాద వ్యవస్థను బద్దలు కొట్టిందన్నారు. ప్రస్తుతం పెట్టుబడి దారి వ్యవస్థ పతనావస్థకు చేరిందన్నారు. శ్రీలంకలో ఆర్థిక సంక్షోభం ఏర్పడి పిల్లలకు పాలు కూడా దొరకని పరిస్థితి నెలకొంది అన్నారు. ఫ్రాన్స్ లో దేశ అధ్యక్షుడు రాజీనామా చేశారన్నారు. లాటిన్ అమెరికాలో కమ్యూనిస్టు శక్తులు బలం పుంజుకుంటున్నాయన్నారు. కార్మిక వర్గం మరింత బలోపేతం దిశగా నడుస్తున్నాయన్నారు. భారతదేశంలో కూడా ఏడాది పాటు జరిగిన రైతాంగ ఉద్యమం స్ఫూర్తిగా నిలుస్తుంది అన్నారు. వీటన్నిటి వెనుక అక్టోబర్ విప్లవం స్ఫూర్తి దాగుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఐ విద్యారంగం కన్వీనర్ ఎం వెంకయ్య, సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి, పార్టీ నాయకులు అర్ వెంకట్రావు, ఉప్పుటూరి ప్రకాష్ రావు, ఎస్డి సర్దార్, ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రామకృష్ణ, కమ్యూనిజం పత్రిక ఎడిటర్ ఎంసి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అందె నాసరయ్య ఎన్నికపై ప్రజాసంఘాల హర్షం

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా రెండోసారి...

విశాలాంధ్ర-మార్కాపురం : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా అందె నాసరయ్య తిరిగి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 4,5 తేదీలలో విజయవాడ నగరంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర పార్టీ నాసరయ్యను రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా తీసుకోవడం జరిగింది. ఈయన విద్యార్థి దశ నుండి ఏఐఎస్ఎఫ్ ఉద్యమంలోను అనంతరం ఏఐఎఫ్ఐ యువజన విభాగంలో చురుకైన పాత్ర పోషించారు. యువజన సంఘం నుండి సీపీఐలో చేరిన ఆయన గత 5 దశాబ్దాలుగా పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం రాజీలేని పోరాటాలను కొనసాగిస్తూ మార్కాపురం ప్రాంతంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజల నుండి ప్రశంసలు పొందుతున్నారు. నాసరయ్య సీపీఐ ప్రజా కార్మిక సంఘమైన, 103 సంవత్సరాల చరిత్ర కలిగిన అల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటియుసి)లో ప్రధాన భాధ్యతలు నిర్వహిస్తూ మార్కాపురం ప్రాంతంలో కార్మికుల న్యాయమైన హక్కుల కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టారు. పట్టణంలో వివిధ రంగాలకు చెందిన దాదాపు 30 కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏఐటియుసి అనుబంధ సంఘాలకు అందే నాసరయ్య నేతృత్వం వహిస్తూ కార్మికుల పక్షాన పెద్ద దిక్కుగా వున్నారు. గతంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శిగా, ప్రస్తుతం నియోజకవర్గ కార్యదర్శిగాను, జిల్లా ఏఐటీయుసి అనుబంధ కార్మిక సంఘాలకు గౌరవ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నాసరయ్య సీపీఐ తరుపున గతంలో పలు మార్లు మున్సిపల్ కౌన్సిలర్ గాను, ఒకసారి మున్సిపల్ వైస్ ఛైర్మన్ గా ఎన్నికయి సమర్ధవంతంగా పనిచేశారు. విద్యార్థి దశ నుండి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటు అంకితభావం, నిజాయితోను, నిబద్ధతతోను పనిచేస్తున్న అందే నాసరయ్య సీపీఐ పార్టీకి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలి: ఎస్పీ

విశాలాంధ్ర-ఒంగోలు: ప్రజల నుండి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కరించుటకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మల్లికగర్గ్ ఆధ్వర్యంలో పోలీసు స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో పలు ప్రాంతాలు నుండి వచ్చిన ఫిర్యాదుదారుల రాతపూర్వక అర్జీలను ఎస్పీ స్వయంగా స్వీకరించి వారితో ముఖాముఖీ మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి సమగ్రముగా అడిగి తెలుసుకున్నారు. వాటిని చట్టపరిధిలో సత్వరం పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అందిన ఫిర్యాదులపై ఎస్పీ సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో వెంటనే ఫోన్ లో మాట్లాడి స్పందన పిటిషన్ల పట్ల అధిక దృష్టి సారించి చట్టపరిధిలో విచారణ జరిపి ఫిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు.

జూనియర్ అసిస్టెంట్ ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తన వద్ద ఒంగోలుకు చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి రూ.4,60,000 తీసుకొని మోసం చేసినట్లు ఒంగోలులోని బాలకృష్ణ పురంకు చెందిన షేక్ భాషా అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. తనతోపాటు మరో ముగ్గురికి ఒంగోలు ట్రిపుల్ ఐటీ కాలేజీలో రికార్డు అసిస్టెంట్ గా ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఒంగోలు భాగ్యనగర్ 4వ లైన్ కు చెందిన లింగంగుంట్ల క్రాంతి కుమార్ ఒక్కొక్కరి వద్ద లక్షా ముప్పై ఐదు వేలు ... మొత్తం 5 లక్షల నలభై వేల రూపాయలు తీసుకొని ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇచ్చి మోసం చేశాడనీ, డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తునట్లు కారుమంచి గ్రామంకు చెందిన చాట్ల సంతోష్ కుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. కుటుంబ ఆర్థిక అవసరాల నిమిత్తం తన వద్ద నుండి షేక్ మహమ్మద్ యాసిన్ అనే వ్యకి అతని స్థిరాస్తి తనఖా పెట్టి ఒప్పంద పత్రంరాసి రూ. 14 లక్షలు వడ్డీకి తీసుకొని గడువులోపు చెల్లియించకపోగా స్థలం రిజిస్ట్రేషన్ చెయ్యకుండా బెదిరిస్తునట్లు మార్కాపురం టౌన్ కు చెందిన చీమలమర్రి చెన్నారెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అవినీతి, అక్రమాలపై

బహిరంగ చర్చకు సిద్ధమే

ఈడీ సవాల్‌కు స్పందించిన మాలమహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య

విశాలాంధ్ర-ఒంగోలు: ఎస్సీ కార్పొరేషన్ ఈడి విశ్వనాథ్ అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య ప్రకటించారు. ఒంగోలులోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంజయ్య మాట్లాడుతూ, ఎస్సీ కార్పొరేషన్ నిధుల్ని దుర్వినియోగం చేసిన ఈడీ విశ్వనాథ్ కు జైలు తప్పదన్నారు. ఈడీ విశ్వనాథ్ కలెక్టర్ని మభ్యపెట్టి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్థాయిలో ఇచ్చే షోకాస్ నోటీసును కలెక్టర్ చేత ఇప్పించారన్నారు. ఈడీ అవినీతి మీద ఈ ఏడాది మార్చిలో ఫిర్యాదు చేస్తే, ఇంతవరకు విచారణ, చర్య లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఈడీ అవినీతి బయటకు రాకుండా అడ్డుపడ్డ జిల్లా అధికారులు, విశ్వనాథ్ ని పంచాయతీరాజ్ శాఖకు సరెండర్ చేయటాన్ని అడ్డుకోలేరన్నారు. ఈడి విశ్వనాథ్ డీజిల్ దొంగని రుజువు చేసేందుకు, తమ వద్ద ఉన్న ఆధారాలను అంజయ్య బయటపెట్టారు.విశ్వనాథ్ వినియోగించిన వెహికల్ కు డీజిల్ బిల్లులే 8 నెలల కాలానికి 3 లక్షల 78 వేల రూపాయలు అయ్యాయన్నారు. పెట్రోల్ బంక్ యాజమాన్యం ఎస్సీ కార్పొరేషన్ పేర ఇచ్చిన రసీదుల్లో, విశ్వనాథ్ సొంత కారు నంబర్ కూడా ఉందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ క్యాష్ బుక్ బయటకు వస్తే ఈడి అవినీతి పూర్తిస్థాయిలో వెల్లడవుతుందన్నారు. నిరుద్యోగ యువత ఎన్ఎస్ఎఫ్డిసి గ్రాంట్ కోటి రూపాయల్లో సుమారు రూ.50 లక్షల నిధుల్ని, తప్పుడు బిల్లులు పెట్టి కాజేసాడన్నారు. ఈడి అవినీతి అక్రమాలపై లోకాయుక్తలో ఫిర్యాదు చేస్తున్నట్టు చెప్పారు. 19 నెలల 5 రోజుల పదవీకాలంలో ఈడీ విశ్వనాథ్ డ్రా చేసిన డబ్బులతో కొనుగోలు చేసిన ప్రతి వస్తువును హ్యాండోవర్ చేసుకున్నాకే, ఈడీనిరిలీవ్ చేయాలన్నారు. ఈడి అవినీతిపై తాము చేసిన ఫిర్యాదుల విచారణ పూర్తయ్యేంతవరకు, ఈడీకి ఎల్.పి.సి ఇస్తే సహించేది లేదన్నారు. దళిత నాయకులు ఏలూరు శ్రీనివాసరావు ఎరిచర్ల రమేష్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా సత్యదేవుని వ్రతం

విశాలాంధ్ర-బల్లికురవ : తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచారపరిషత్ , టిటిడి దాస సాహిత్య ప్రాజెక్టు ఆద్వర్యంలో సోమవారం మండల పరిధిలోని వైదన గ్రామంలో కార్తీక మాసంలో అతి ముఖ్యమైన కార్తీక పౌర్ణమి రోజున శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానము నందు టిటిడి దాస సాహిత్య ప్రాజెక్టు కోఆర్డినేటర్ చెన్నుపల్లి.నాగేశ్వరరావు సత్యన్నారాయణ స్వామి వారి వ్రతము ఏర్పాటు చేసినారు. ముందుగా దేవస్థానం అర్చకులు పరుచూరి. విశ్వనాథ శర్మ, పేటేటి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న దంపతులకు రోటరీ క్లబ్ అఫ్ శింగరకొండ అద్దంకి వారు,వైదన గ్రామ సర్పంచ్ మేడా జయలక్ష్మి భర్త మేడా పెద.అంజయ్య పేరుమీద వారి మనుమడు మేడా.శివ దుర్గా ప్రసాద్ , కుటుంబ సభ్యులు, రోటరీ క్లబ్ అఫ్ శింగరకొండ అద్దంకి, అధ్యక్షుడు సందిరెడ్డి. శ్రీనివాసరావు ఎంతో పవిత్రమైన తులసి మొక్కలు, సత్యనారాయణ స్వామి చిత్ర పటాలు,తిరుమల తిరుపతి దేవస్థానం నుండి వచ్చిన స్వామి వారి కంకనాలు, అక్షంతలు, శ్రీ వెంకటేశ్వర స్వామిరి పుస్తక ప్రసాదములు అందజేశారు. బ్రహ్మయ్య, అంజయ్య, దానయ్య పాల్గొన్నారు.

విద్యార్థులపై శ్రద్ధ చూపండి

విశాలాంధ్ర-దర్శి : మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వెంకాయమ్మ ఆకస్మిక తనిఖీ చేశారు.మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు సోషల్ టీచర్ గత రెండు సంవత్సరాలుగా లేని కారణంగా బాగా ఇబ్బందులు పడుతున్నామని, హెడ్ మాస్టర్ సరిగా పాఠశాలకు రావట్లేదని ఇష్టం వచ్చినట్టు సెలవులు పెట్టి వెళ్తున్నారు అని సరిగా క్లాసులకు రావట్లేదని ఆమె దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆమె డిఇఒ విజయ్‌భాస్కర్‌కి ఫోన్ చేసి డిప్యుటేషన్ పై సోషల్ టీచర్‌ని నియమించాలని కోరారు. విద్యార్థులపై శ్రద్ధ చూపాలన్నారు. అంతరం జగనన్న విద్యకానుక, నాడు నేడు , అమ్మవడి పథకాలు అందరికీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. స్కూల్ కమిటీ ఛైర్మెన్ నలదిమ్ము రమణారెడ్డి, ఎంఇఒ రఘు రామయ్య, ఎంపిడిఒ కుసుమ కుమారి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్. ఎం బాషా, అద్దగిరి నాగేశ్వరరావు, నాదెండ్ల అంజయ్య పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ- ముగ్గురికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర-చీరాల: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం 216 జాతీయ రహదారిలో లక్ష్మీపురం సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. 108 సిబ్బంది, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలేనికి చెందిన కె.సుబ్బారెడ్డి, నాగరాజు ఇద్దరు కలసి ద్విచక్రవాహనంపై చీరాలకు బయలుదేరారు. ఈ సమయంలో లక్ష్మీపురం సమీపానికి రాగానే అంతర్గత రహదారి నుంచి జాతీయ రహదారిలోకి మరో ద్విచక్రవాహనం నడుపుతున్న వేటపాలెం మండలం లక్ష్మీపురానికి చెందిన వి రాము వచ్చాడు. ఈ రెండు వాహనాలు జాతీయరహదారిలో వేగంగా ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో పై ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు శ్రీరాల 108 సిబ్బంది క్షతగాత్రులను వాహనంలో చీరాల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం నాగరాజు, రాములను గుంటూరుకు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అమ్మనబ్రోలు గురుకులంలో

14న పాత వస్తువులు వేలం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని అమ్మనబ్రోలు ఆంధ్రప్రదేశ్ 'బాలికల' గురుకుల విద్యాలయము నందు పాత ఫర్నిచర్, పాత అల్యూమినియం పాత్రలు, పాత ఇనుప మంచములు, తదితర వస్తువులను వేలము ఈ నెల 14 జరుగునని ప్రధానచార్యులు ఎ. శైలజ ప్రియదర్శిని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కొరకు 9908187252 సంప్రదించగలరు అని అన్నారు.

శివయ్యకు భక్తకోటి పూజలు

విశాలాంధ్ర-ముండ్లమూరు: మండలంలోని పులిపాడు గంగా అన్నపూర్ణ సమేత పూర్ణేశ్వర స్వామి, మారెళ్ళ భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వర స్వామి, ఈదర గంగా పార్వతి సమేత ఉమామహేశ్వర స్వామి, పసుపుగల్లు గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, ఉల్లగల్లు గంగ పార్వతి సమేత కోటేశ్వరస్వామి, భీమవరం భీమ లింగేశ్వర స్వామి, ముండ్లమూరు మల్లమాంబ సమేత మల్లికార్జున స్వాములకు పూజలైన గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ, రుద్రాభిషేకాలు, విశేష పంచామృత అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలను పూజారులైన చదలవాడ సుబ్బారావు, దుర్భాకుల నగేష్ శర్మ, నూతలపాటి వెంకటేశ్వర్లు, పరాంకుశ నరసింహమూర్తి, స్వర్ణ సుబ్బారావు, నూతలపాటి ప్రసాదులు పూజలు చేశారు. భక్తుల శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారు మ్రోగాయి.

శివాలయాలు భక్తులతో కిటకిట

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండలంలోని శివాలయాలు భక్తులతో శివనామ స్మరణతో మారుమోగాయి. వేకువజాము నుండే మహిళలు కార్తీక స్థానాలు చేసి, శివాలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మోట్ల మల్లికార్జునపురం వద్ద పూజారి అశ్విని కుమార్,దోర్నాల పార్వతి చర్ల మల్లేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ చెన్న మల్లేశ్వర స్వామి దేవాలయంలో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఆలయ పూజారి కొండవీటి సుదర్శన చార్యులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా, అయ్యప్ప స్వామి, శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

విశాలాంధ్ర-చీరాల : పరమశివుడి కృపా కటాక్షాలతో ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పేదవారికి అన్నదాన కార్యక్రమాలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులను, అర్చక స్వాములను, దాతలను అభినందిస్తున్నానని చీరాల వైఎస్సార్సీపీ ఇన్చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. కార్తీక సోమవారం సందర్భంగా గంగా భ్రమరాంబ పునుగు రామ లింగ మల్లేశ్వర స్వామి దేవాలయం పేరాల శివాలయంలో చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుతో కలిసి పూజ లు నిర్వహించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ గోలి శ్రీనివాసరావు, అర్చకులు రాజశేఖర్ శర్మ, కమిటీ సభ్యులు సంక మురళీకృష్ణ, బలగం శెట్టి అంకమ్మరావు, గంజి పార్వతి, మేనేజర్ శివ నాగ దాసు దామర్ల శివయ్య, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు, అందె నరసింహారావు, గోలి రవి, గోలి జ్ఞాన ప్రసాద్, గిరి మున్సిపల్ కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, కంప అరుణ్, సురగాని లక్ష్మి, మల్లెల రాజశేఖర్, బ్రహ్మం, అన్నదాతలు కొమ్ము కొండయ్య, విష్ణు మూలకల శ్రీనివాసరావు, సాంబశివరావు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిని అగ్రస్థానంలో నిలుపుతా

విశాలాంధ్ర-అద్దంకి : అద్దంకి పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిలో అగ్రస్థాంలో నిలపడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు శాప్‌నెట్ చైర్మన్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు.గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 18వ వార్డులో సోమవారం అధికారులు,స్థానిక నాయకులతో కలసి కట్టకిందపాలెంలో కృష్ణచైతన్య ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పాలన ను వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అద్దంకిలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు.అర్హులందరికీ నివేశన స్థలాలు సమకూర్చి పక్కా గృహాలు నిర్మించడం జరుగుతుందన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎల్.ఎస్తేరమ్మ,కమీషనర్ టి.రవికుమార్,వైస్‌చైర్మన్ దేసు పద్మేష్, కాకాని రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

పందుల బెడద అరికట్టండి

విశాలాంధ్ర-దర్శి : దర్శి వ్యవసాయ అగ్రకల్చరల్ పాల్ టెక్నిక్ కళాశాల ఆవరణ, వ్యవసాయ పరిశోధన కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రంలలో పందులు బెడద విపరీతంగా ఉన్నదని, పందులను వెంటనే అరికట్టలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జరిగిన స్పందనలో యమ్‌ఆర్‌ఓ శ్రావణ కుమార్, మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. టైం స్కేల్ ఎంప్లాయిస్‌అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ గత పదినెలల నుండి పందులు సంచరిస్తూ ఉన్నాయనీ, కూరగాయల మొక్కలు, ఆకు కూరలు నాశనము చేస్తున్నాయని, వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని పంటలనుపాడు చేస్తున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి పందులను అరికట్టేందుకు కృషి చేయాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు జి.ప్రేమ్‌కుమార్, యన్.నాగేంద్ర పాల్గొన్నారు.

ఏ1 గ్లోబల్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే

విశాలాంధ్ర-మార్కాపురం : స్థానిక ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ యమ్ షంషీర్ అలిభేగ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా ఫ్రెషర్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కెపి నాగార్జునరెడ్డి హాజరై విద్యార్థులకు సందేశం ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాల మురళీక్రిష్ణ, రాష్ట్ర ఎంఎస్ఎంఇ కార్పొరేషన్ డైరెక్టర్ మేడా వెంకట బద్రీనాథ్, డాక్టర్ ఎస్కె మాక్బుల్ బాష, రాష్ట్ర బిసి జనసభ ప్రధాన కార్యదర్శి పీఎల్పీ యాదవ్, మురారి వేంకటేశ్వర్లు, రామడగు రమేష్, కళాశాల డైరెక్టర్ సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.తొలుత ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీధర్ అతిథులను వేదికపైకి ఆహ్వానించారు.

మణికేశ్వరం మల్లేశ్వరస్వామి సేవలో కృష్ణచైతన్య

విశాలాంధ్ర-అద్దంకి: దక్షిణ చినకాశిగా పేరుగాంచిన మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భముగా దర్శించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలకమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కృష్ణచైతన్య ప్రారంభించారు.

న్యాయ సేవలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-పామూరు : ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న న్యాయ సేవలను సద్వినియోగించుకోవాలని లీగల్ పారా వాలంటర్ షేక్ నాయబ్ రసూల్, అంగన్వాడి సూపర్వైజర్ దేవి కృపావరం అన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉత్తర్వుల మేరకు 31 అక్టోబర్ నుండి 13 నవంబర్ వరకు జరిగే ఔట్రీచ్ కార్యక్రమంలో భాగంగా కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర ఆదేశాల మేరకు సోమవారం స్థానిక ఎర్రచీలులో ఉచిత న్యాయ సహాయంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. పారా లీగల్ వాలంటీర్ ఎస్కె నాయబ్ రసూల్, అంగన్వాడీ సూపర్వైసర్ దేవకృపావరంలు మాట్లాడుతూ న్యాయానికి పేద, గొప్ప తేడా లేదన్నారు. బాధితులు జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించి ఉచితంగా న్యాయసహాయం పొందవచ్చన్నారు. తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి కొణిజేటి సుభాషిణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు, రేపు ఎంపీ మాగుంట పర్యటన

విశాలాంధ్ర-ఒంగోలు: ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మంగళ, బుధవారాలలో జిల్లాలో పర్యటించనున్నారు. ఐదు గంటల నుండి తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ఎంపి నిధులతో రెడ్ క్రాస్ సంస్థ ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను ప్రారంభిస్తారు.అనంతరం ఎర్రన దూరదర్శన్ భవన్‌లో జరిగే టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సమావేశంలోను, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీ శ్రీనివాస కళ్యాణోత్సవంలో పాల్గొంటారు.

దినసరి ఉద్యోగులకు చట్ట ప్రకారం వేతనం చెల్లించండి

విశాలాంధ్ర-ఒంగోలు : దినసరి ఉద్యోగులకు చట్ట ప్రకారం వేతనం చెల్లించాలని జిల్లా కలెక్టరు ఏ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. దినసరి వేతన చట్టం అమలు తీరుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టరు ఛాంబరులో ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న కలెక్టరు అధ్యక్షతన సోమవారం జరిగింది. కార్మిక చట్టాలననుసరించి వేతన సవరణ ప్రక్రియ పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టరు తెలిపారు. చట్ట ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న దినసరి వేతన ఉద్యోగులు, కూలీల వివరాలపై ఆయన ఆరా తీశారు. నైపుణ్యం, నైపుణ్యం లేని వారికి ఇచ్చే వేతనాల నిర్ధారణ ప్రక్రియ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కమిటీ నిర్ణయించాల్సి ఉందన్నారు. జిల్లాలో వివిధ శాఖలలో సుమారుగా 500 మంది దినసరి వేతన (ఎన్.ఎం.ఆర్) ఉద్యోగులు, కూలీలు ఉన్నారని అధికారులు కలెక్టరు దృష్టికి తెచ్చారు. స్పష్టమైన వివరాలు అధికారుల వద్ద లేకపోవడం, దినసరి వేతన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు లేకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సమగ్ర వివరాలు, ప్రతినిధులు లేకుండా జిల్లా స్థాయి కమిటీలు ఎలా నిర్వహిస్తారని అధికారులను ప్రశ్నించారు. తదుపరి సమావేశానికి సమగ్ర వివరాలతో హాజరు కావాలని ఆదేశించారు. అలాగే ఆయా శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగ, కూలీల సంఘాల ప్రతినిధులను సమావేశంలో చేర్చాలని ఆయన స్పష్టం చేశారు. కమిటీలో అధికారులు, అనధికారులు చర్చించిన తదుపరి నైపుణ్యం, నైపుణ్యం లేని వారికి దినసరి వేతనాలను నిర?యిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో కార్మిక శాఖ సహాయ కమిషనర్లు కోటేశ్వరరావు, కనకదుర్గా భవాని, వ్యవసాయ శాఖ జె.డి శ్రీనివాసులు, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్ఈ మర్దన్ అలీ, పశు సంవర్ధక శాఖ జెడి డాక్టర్ బేబీరాణి, తదితరులు పాల్గొన్నారు.

వన భోజనాలు... ఆనవాయితీ

విశాలాంధ్ర-పొన్నలూరు : కొండపి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 14 సోమవారం సంగమేశ్వరం దేవస్థానం నందు నిర్వహించే కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కొండపి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ డోల శ్రీ బాలవీరంజనేయ స్వామి పిలుపునిచ్చారు. సోమవారం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దామచర్ల సత్య , స్థానిక టీడీపీ నాయకులతో కలిసి సంగమేశ్వర దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ సంగమేశ్వర దేవాలయ అభివృద్ధికి పాటుపడింది దామచర్ల కుటుంబం అని అన్నారు. ఆ కుటుంబ ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా వన భోజనాల కార్యక్రమం ఏర్పాటు చేయడం ఆనవాయితీ అని తెలిపారు. స్వామి దర్శనం కోసం పాదయాత్రగా వస్తున్నట్లు తెలుపగానే కొంతమంది హడావిడి చేయడం విడ్డురంగా వుందన్నారు. ట్రాఫిక్ సమస్య చూపి తమకు అడ్డంకులు స ృష్టించనంత మాత్రాన వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. అనుమోలు సాంబశివరావు, జరుగుమల్లి టీడీపీ అధ్యక్షులు పోకూరి రవిబాబు, మాజీ అధ్యక్షులు మండవ ప్రసాద్, సీనియర్ నాయకులు పిల్లి వెంకట నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కొండ్రగుంట నరసయ్య, మండవ రామయ్య, ఒంగోలు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మండవ మురళి, కొండపి నియోజకవర్గ యువత అధ్యక్షులు బెల్లం రామక ృష?, నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ నేలపాటి బ్రహ్మయ్య, స్థానిక నాయకులు రమణారెడ్డి తోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

భవాని శంకరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండల కెంద్రమైన పుల్లలచెరువు గ్రామంలోని భవాని శంకర స్వామి వారి దేవాలయం నందు కార్తిక సోమవారము మరియు కార్తీక పౌర్ణమి కలిసి రావడంతో శివాలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుండే స్వామి వారికి అభిషేక పూజా కార్యక్రమాలు మరియు స్వామివారి శాంతి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు కళ్యాణ మహోత్సవాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించి తన్మయత్వం పొందారు. తలంబ్రాలు భక్తులందరికీ పంచిపెట్టారు. అనంతరం వచ్చినటువంటి భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

విశాలాంధ్ర-బల్లికురవ : కార్తీక మాసంలో అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక పౌర్ణమి పర్వదిన వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం రోజున కార్తీక పౌర్ణమి రావటం శివ భక్తులు మరింత భక్తి పార రవశ్యలో మునిగిపోయారు. వేకుఝాము నుండి గ్రామాల్లోని దేవాలయాలన్నీ భక్తులతో కిటకిట లాడాయి. ఓం నమశ్శివాయ పంచాక్షరి మంత్రంతో గ్రామ సీమలలోని దేవాలయాలు పులకించి పోయాయి. కార్తీక పౌర్ణమి రోజున సముద్రం స్నానం ఆచరిస్తే మరింత పుణ్యం చేకూరుతుందని భావనతో భక్తులు చీరాల సముద్ర స్నానానికి తరలి వెళ్లారు.కోటప్పకొండ శివ క్షేత్రానికి అత్యధికంగా భక్తులు తరలి వెళ్లారు.సాయంత్రం వేళ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కొనసాగింది.

భక్తిశ్రద్ధలతో కార్తీకపూజలు

విశాలాంధ్ర-తర్లుపాడు : మండల కేంద్ర మైన తర్లుపాడులో కార్తీక మాసం పూజలను సోమవారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగవైభవంగా జరుపుకున్నారు. కార్తీక మాసం శివునికి ప్రీతి పాత్రకరమైన సోమవారం కావడంతో భక్తులు ఉదయాన్నే లేచి పుణ్యస్నానాలు ఆచరించి నీలకంతేశ్వరాలయంలో ప్రదక్షిణలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం, చతుర్ముఖ సహస్ర లింగేశ్వర స్వామి వద్ద మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. అనంతరం శ్రీశ్రీ గంగాభవాని సమేత నీలకంటేశ్వర స్వామిని దర్శించుకుని, అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు మూడు శతాబ్దాల క్రితం ఒక మహాముని(పుష్పగిరి పీఠాధిపతులు) ప్రతిష్టించిన శివలింగం కావడంతో దూర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి విచ్చేసి, స్వామివారిని దర్శించుకుంటారని ఆలయ ధర్మకర్త నేరెళ్ల కుమార్ తెలిపారు.భక్తులకు ఆలయ ప్రధానార్చకులు దేవులపల్లి పవన్ కుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేతగుడిపి గ్రామంలో... కేత గుడిపిలో వెలసిన శ్రీ గంగాభవాని పార్వతీ సమేత కేదారేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస సోమ వారాన్ని పురస్కరించుకొని మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీకదీపాలను వెలిగించారు. వేకువ జాము నాలుగు గంటల నుంచే ఆలయాన్ని చేరుకొని కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్తీకమాస పూజల్లో పొదిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ బాబు దంపతులు మరియు టీవీ పల్లి ఎస్ఐ ముక్కంటి, గ్రామ సర్పంచ్ డి.పెద్ద మస్తాన్, మార్కాపురం నియోజకవర్గ యాదవ సంఘం యువజన నాయకుడు చెవుల రమేష్ యాదవ్ పాల్గొని కేదారేశ్వర స్వామిని దర్శించుకుని, అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విచ్చేసిన సిఐ సుధాకర్ బాబు దంపతులను, ఎస్సై ముక్కంటి లను గ్రామ సర్పంచ్ డి.పెద్ద మస్తాన్, పాఠశాల పిఎంసి చైర్మన్ రమేష్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సాయంత్రం కూడా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని, కార్తీకదీపాలనువెలిగించి వారి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేఅగ్రహారం శివాలయం...

విశాలాంధ్ర-పొన్నలూరు : కార్తీక మాసంలో అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక పౌర్ణమి పర్వదిన వేడుకలు మండలంలో కే అగ్రహారం శివాలయం నందు ఘనంగా నిర్వహించారు. సోమవారం రోజున కార్తీక పౌర్ణమి రావటం శివ భక్తులు మరింత భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. వేకువ జామున నుండి గ్రామాల్లోని దేవాలయా లన్నీ భక్తులతో కిటకిట లాడాయి. ఓం నమశ్శివాయ పంచాక్షరి మంత్రంతో గ్రామ సీమలలోని దేవాలయాలు పులకించి పోయాయి. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి మండల యువజన నాయకుడు పిల్లితిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

'స్పందన' నిర్వహించకుంటే చర్యలు తప్పవు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : స్పందన కార్యక్రమాన్ని మండలాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభించకపోతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టరు ఏఎస్ దినేష్ కుమార్ హెచ్చరించారు. స్పందన కార్యక్రమం సోమవారం స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. వీక్షణ సమావేశం ద్వారా అన్ని మండలాల తహసీల్దార్లు, ఎం.పి.డి.ఓలతో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రాల ద్వారా కలెక్టరును వేడుకున్నారు. అర్జీదారుల సమస్యలను సావధానంగావిని తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తన పరిధిలోని వాటికి కలెక్టరు తక్షణమే పరిష్కార మార్గం చూపగా, కొన్నిటిని పరిశీలన, మరికొన్నిటిని విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. తన పరిధిలో లేని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని ఆయన హామీ ఇచ్చారు.

జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో ఆయన మాట్లాడారు. "డయల్ యువర్ కలెక్టరు" కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారమార్గం చూపారు. స్పందనలో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టరు తెలిపారు. అర్జీలపై ఆయా మండలాల అధికారులతో మాట్లాడేందుకు ప్రయత్నించగా 11 గంటలకు కూడా హాజరు కాకపోవడంపై ఆయన మండిపడ్డారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమం ప్రారంభించకపోతే షోకాజు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. విధి నిర్వహణలో నిర్లిప్తత వీడాలన్నారు. మండల స్థాయిలో పరిష్కరించాల్సిన అర్జీలను కూడా జిల్లా కేంద్రానికి పంపడం సరికాదన్నారు. జిల్లా వ్యాప్తంగా 7,271 కేసులు నమోదు కాగా, 353 కేసులకు మాత్రమే అధికారులు స్పష్టమైన నివేదికలను కోర్టుకు సమర్పించారని వివరించారు.

కోర్టు నుంచి తుది తీర్పు వెలువడిన కేసులపై దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. స్పందనలో అర్జీలు 87 శాతం రెవిన్యూ అంశాలకు చెందినవేనని ఆయన వివరించారు. తహసీల్దార్లు సక్రమంగా పనిచేస్తే మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను సచివాలయాల సిబ్బంది సమీకరించి తహశీల్దారుకు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారం కోరుతూ ఎన్ని పర్యాయాలు తహశీల్దారు వద్దకు వెళ్లారు అనే అంశాలను అర్జీ పై స్పష్టంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టరు ఎం అభిషిక్త్ కిషోర్, డి.ఆర్.ఓ. బి.చిన ఓబులేసు, భూ సేకరణ ప్రత్యేక కలెక్టరు ఎస్.సరళా వందనం, ప్రత్యేక ఉప కలెక్టర్లు నారదముని, గ్లోరియా, తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసు

74 మందికి రూ.3.613 లక్షల అపరాధ రుసుం

విశాలాంధ్ర-తర్లుపాడు : విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల ఆధ్వర్యములో సోమవారం మండలంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. సూపరింటెండింగ్ ఇంజనీర్, విజిలెన్స్, కార్పొరేట్ ఆఫీస్, విజయవాడ యం. అల్ఫాన్స్ డివిజినల్ ఇంజనీర్, విజిలెన్స్, ఒంగోలు-1 శ్రీమతి టి. హైమావతి, డివిజినల్ ఇంజనీర్, విజిలెన్స్, ఒంగోలు-2 టి. శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, విజిలెన్స్, ఒంగోలు, వి. శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, విజిలెన్స్, ఒంగోలు, ఏ. శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, విజిలెన్స్, ఒంగోలు, ఖాన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, విజిలెన్స్, ఒంగోలు, కోటేశ్వరరావు మరియు ఆపరేషన్ డివిజన్, డివిజినల్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు స్టాఫ్ 30 మంది అధికారులు, 56 మంది సిబ్బంధి, 34 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు.

2584 సర్వీసులు తనిఖీ చేసి, అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యాన్ని పాల్పడుతున్న 74 మందికి రూ. 3.613 లక్షలు అపరాధ రుసుము విధించారు. మీటరు ఉన్నపటికీ అక్రమముగావిద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 19 మందికి రూ 2.09 లక్షలు మీటరు లేకుండా అక్రమముగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 31 మందికి రూ 0.29 లక్షలు అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న 3 మందికి రూ 0.48 లక్షలు అనుమతించిన లోడు కంటే అదనముగా విద్యుత్ వాడుతున్న 20 మందికి రూ 0.86 లక్షలు మీటరులో లోపము ఉండి బిల్లు తక్కువ వస్తున్న ఒకరికి రూ 0.20 లక్షలువిద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టం కు లోబడి ఉంటాయన్నారు. వినియోగదారులందరూ వారి ప్రాంగణంలో ఉండే విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేటట్లు నిర్ధారించుకోవాలనీ, ఒక వేళ సీలు లేకపోయినా, తుప్పు పట్టి ఊడిపోయినా, వెంటనే సంభదిత విద్యుత్ సిబ్బందికిరాత పూర్వకంగా తెలియచేయాలని అధికారులు తెలిపారు. సాగర తీర ప్రాంతాలలోని మీటర్లకు ఉన్న సీలు త్వరగా పాడియాపోయే అవకాశం ఉన్నందున అప్పుడప్పుడు పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఏ ప్రాంతంలోనైనా విద్యుత్ అధికారుల తనిఖీలలో సీలు లేకపోవుట, ఉద్దేశపూర్వకంగా వాటిని తొలగించుట, గాట్లు పెట్టుట వంటివి గమనించినచో విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు. మొదటి సారికి తప్పిదానికి మూడు రెట్లు, రెండవసారికి తప్పిదానికి ఆరు రెట్లు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 9440812359, 7382623185 నేరుగా లేదా వాట్సాప్ ద్వార సంప్రదించవచ్చు అని సూచించారు.

సబ్సిడీపై శనగ విత్తనాలు

విశాలాంధ్ర-వెలిగండ్ల : శనగ విత్తనాలు సబ్సిడీ ధరపై రైతులకు అందించడం జరుగుతుందని ఎంపీపీ దంపతులు రామణ మహాలక్ష్మమ్మ తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని హుస్సేన్ పురం ఆర్‌బికే నందు రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేశారు. రమణ మహాలక్ష్మి మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ధరకు శనగ విత్తనాలు అందజేస్తున్నారని ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారి రంగాకృష్ణ మాట్లాడుతూ శనగ విత్తనాలు క్వింటా6456 రూపాయలుగా ఉన్నాయని సబ్సిడీ కింద 25 శాతం ప్రభుత్వం రైతులకు అందజేస్తుందని 1614 ఫోను 4842 చెల్లించి విత్తనాలను పొందవచ్చని తెలిపారు. నాగూర్ యాదవ్, సింగల్ విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు, జార్జ్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు దేవ సహాయం, ఎంపీటీసీ జనార్దన్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు శివరామయ్య, బల్లవరం సర్పంచ్ చిలకల నారాయణమ్మ వెలిగండ్ల సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు, యువత అధ్యక్షులు తాతపూడి నాని, ఆదిరెడ్డి, చిలకల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

శ్మశానవాటిక సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-చీరాల : దళిత క్రైస్తవులు,మాల మాదిగలు ఒకే శ్మశానన్ని ఉపయోగించడం వలన మృత దేహంపై మృతదేహాన్ని పూడ్చడం జరుగుతోందని అధికారులు స్పందించి శ్మశాన వాటిక సమస్యలను పరిష్కరించాలని ప్రజా వేదిక రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి ఏసురత్నం అన్నారు. చీరాల రెవిన్యూ డివిజనల్ అధికారిణి సరోజినికి ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామానికి చెందిన క్రిష్టియన్ జాయింట్ ఏక్షన్ కమిటీ,ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి ఏసురత్నం ఆధ్వర్యంలో తమ గ్రామంలో క్రైస్తవ శ్మశాన భూమి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. ఏసురత్నం మాట్లాడుతూ ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామంలో దళిత క్రైస్తవుల కోసం కేటాయించిన శ్మశాన భూమిలో వర్షపు నీరు నిలిచి మృతదేహాలను ఖననం చేయడానికి నానా ఇబ్బందులు పడుతున్నారని, ఉన్న భూమి చాలా తక్కువని అందులోనే మ ృతదేహంపై మ ృతదేహాన్ని ఖననం చేయడం జరుగుతోందని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు యారం ఏసుబాబు, స్టాలిన్, మోషే, కోటేశ్వరరావు, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ పాస్టర్ అగస్టీన్ మృతి

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక బేతేలుపురానికి చెందిన సీనియర్ పాస్టర్ రెవ.కేజే అగస్టీన్ (90) ఆదివారం రాత్రి మృతి చెందారు. మండల పాస్టర్స్ అసోసియేషన్‌కు గౌరవ అధ్యక్షులుగా సేవలందిస్తున్న ఆయన భౌతిక దేహాన్ని పాస్టర్ల సంఘం సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, ఆయన ఆత్మ నిత్య విశ్రాంతి కొరకు ప్రార్ధనలు చేశారు. వారిలో అధ్యక్షులు దారా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు నూనె యోహాను, కార్యదర్శి జి.యేషయ్యా, కోశాధికారి కొండా వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు 950 దరఖాస్తులు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు మండలం నుంచి 950 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో ఆర్ జనార్ధన్ సోమవారం ప్రకటనలో తెలిపారు సోమవారంతో ఓటు నమోదుకు గడువు ముగిసినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టులకు జీవనోపాధి కల్పించండి

విశాలాంధ్ర-ఒంగోలు : గతంలో మావోయిస్టులుగా ఉండి ప్రభుత్వానికి లొంగిపోయిన వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించాలని జిల్లా సంయుక్త కలెక్టరు ఎం అభిషిక్త్ కిషోర్ తెలిపారు. మావోయిస్టులుగా ఉండి లొంగిపోయిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం సోమవారం స్థానిక జిల్లా సంయుక్త కలెక్టరు ఛాంబరులో జరిగింది. మావోయిస్టుల వృత్తిలో నుంచి జనజీవన స్రవంతిలోకి వచ్చే వారి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అభిషిక్త్ కిషోర్ చెప్పారు. వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. జనజీవన స్రవంతిలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. వారి ఆర్థికాభివృద్ధికి అవసరమైన వనరులను ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. మావోయిస్టులు వారి వృత్తిని వదిలి ఇప్పటికే సాధారణ జీవితం గడుపుతున్న చీమకుర్తి మండలం గాడిపర్తివారిపాలానికి చెందిన ఎం.కోటేశ్వరరావుకు గేదెల యూనిట్, అర్ధవీడు మండలానికి చెందిన దాసరి ప్రకాష్‌కు మినీ లారీ మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ రాయితీతోనే యూనిట్లు మంజూరు చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. తక్షణమే లబ్ధిదారులకు యూనిట్లు అందించేలా చూడాలన్నారు. సంబంధిత లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో జడ్పీ సిఈఓ బి జాలిరెడ్డి, డి.ఆర్.డి.ఏ పిడి బి బాబూరావు, సిఐ కెవి రాఘవేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు



విశాలాంధ్ర-తర్లుపాడు : ఘర్షణలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని జగన్నాధపురం గ్రామంలోని ఎస్సీపాలెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామంలో ఒక శుభ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏర్పాటు చేసుకున్న సాంస్కృతి కార్యక్రమాలలో అనుకోని సంఘటనలో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. దీంతో ఆదివారం అర్ధరాత్రి ఇరు వర్గాలు రాళ్లురువ్వుకున్నాయి. ఈ గొడవను సర్దుమనిగించేందుకు ముక్కెర కొండయ్య సంఘటన స్థలంలోనికి చేరుకోగా ఆఘర్షణలో అతని తలకు తీవ్ర గాయాలైనాయి. దీంతో మార్కాపూర్ ప్రభుత్వం వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించడం జరిగింది. మరొకరికి స్వల్ప దెబ్బలు తగిలాయి, కొండయ్యను మాత్రం అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించడం జరిగింది. సమాచారం అందుకున్న తాడువారిపల్లి ఎస్ఐపి ముక్కంటి హుటాహుటిన అర్ధరాత్రితన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాల మధ్య గొడవకు దారి తీసిన విషయాలను పరిశీలించి అదుపు చేశారు. ఈ సందరరేగాఎస్సై మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా కవ్వింపు లాంటి చర్యలకు పాల్పడినట్లయితే వారిపై కఠి చర్యలు తప్పవనిహెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే...

విశాలాంధ్ర-బేస్తవారిపేట : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టడం జరిగిందని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. బేస్తవారిపేట సచివాలయం-1 పరిధిలోని పలు వీధుల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గత ప్రభుత్వం హయాంలో ఎన్నికల సమయంలోనే ప్రజా ప్రతినిధులు వార్డుల్లో దర్శనమిచ్చే వారని, వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. జడ్పీటీసీ బండ్లమూడి వెంకట రాజు, సర్పంచ్ బి. ఆశ్రీత జ్యోతి, ఉప సర్పంచ్ మట్టా రమేష్, ఎంపీడీఓ చెన్నకేశవరెడ్డి, ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

దొంగ అరెస్ట్: రూ.7.60 లక్షల సొత్తు స్వాధీనం

విశాలాంధ్ర-చీరాల : పలు చోట్ల ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని రెండో పట్టు పోలీసులు అరెస్టుచేశారు. ఇతని వద్ద నుంచి బంగారు. ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి సోమవారం సాయంత్రం రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ సోమశేఖర్ వివరాలను వెల్లడించారు. గత సంవత్సరం జులై నెలలో వేటపాలెం మండలం కొత్తపేటలో ఉపాధ్యాయులు షేక్ జరీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనం జరిగిందనీ, బంగారు వస్తువులు చోరీకి గురయ్యాయన్నారు. ఆగస్టులో మేదరమెట్ల మండలం బొడ్డువానిపాలెం గ్రామంలో ఓ ఇంట్లో నాలుగు సవర్ల బంగారం చోరీకి గురయ్యింది. సెప్టెంబర్‌లో బల్లికురవ మండలం కొప్పెరపాడు గ్రామంలో నాలుగు సవర్ల బంగారంతోపాటు పదివేల నగదును దుండగులు దొంగలించుకెళ్లారు. వీటిపై ఆయా స్టేషన్లో బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సోమవారం చీరాల మండలం బుర్లవారిపాలెం బైపాస్ కూడలి వద్ద ఓ వ్యక్తి అనుమానస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా చీరాల,మేదరమెట్ల, అద్దంకి,బల్లికురవ తదితర ప్రాంతాల్లో పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడానని నేరం ఒప్పుకున్నాడన్నారు. అనంతరం ఇతని వద్ద నుంచి మొత్తం రూ.7.60 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నారు. పల్నాడు జిల్లా వినుకొండ పట్టణానికి చెందిన షేక్ అల్లాబక్షు అలియాస్ భాష చిన్నతనం నుంచే పలు దొంగతనాలు,నేరాల కేసులో నిందితుడిగా కూడా ఉన్నాడని సీఐ సోమశేఖర్ తెలిపారు.జైలుజీవితం కూడా అనుభవించాడన్నారు. ఇతని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ చెప్పారు.ఈ కేసుల్లో చాకచక్యంగా వ్యవహరించి రికవరీ చేసిన చీరాల రెండో పట్టణ సీఐ సోమశేఖర్, సీసీఎస్ సీఐ ఎం. మురళీకృష్ణ, ఎస్సై కమలాకర్, ఇతర సిబ్బందిని ఎస్పీ వకులందాల్, డీఎస్పీ పి. శ్రీకాంత్ అభినందించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర-కనిగిరి : మండలంలోని తాళ్లూరు గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులతో రూ. 17.50 లక్షలతో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం మరియు సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ సందరరేగా రైతు భరోసా కేంద్రాలతో రైతులకు మరిన్ని ప్రయోజనాలు కలుగుతాయని ప్రజలకు వివరించారు. తాళ్లూరు గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అయినా నవరత్నాలతో ప్రజలకు ఎంత మేరా లబ్ది చేకూరిందో సచివాలయ సిబ్బంది ద్వారా సమాచారం తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదో ఆరా తీశారు. వైసిపి ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని ,సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతాయని భరోసా ఇచ్చారు. మూలే మాలకొండరెడ్డి, సర్పంచ్ పోలా మంగతాయారు, మూలే ఈశ్వరమ్మ, మండల కో ఆప్షనల్ సభ్యులు షేక్ రహీం, ఏఎంసి చైర్మన్ సరిత రెడ్డి, సంగన గురు బ్రహ్మ రెడ్డి, గుడిపాటి వెంకటరెడ్డి, గాలి వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, షేక్ హాజరతుల్లా, రంగనాయకుల రెడ్డి, సంఘ సుబ్బారెడ్డి,పిఆర్ డి ఆదిశేషు, ఏఈ తిరుపాలయ్య, వైద్యాధికారి షేక్ షరీఫ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్లు ఢీ- తప్పిన ప్రాణాపాయం



విశాలాంధ్ర-పెద్దదోర్నాల : పెద్దదోర్నాల మండల పరిధి శ్రీశైలం ఘాట్ చింతల సమీపంలో ఎదురెదురుగా వస్తున్నకార్లు ఒకదానికొకటి ఢీకొన్న సంఘటన సోమవారం జరిగింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో కాన రాని గాయాలు మినహా ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. కార్లో ప్రయాణిస్తున్న మహిళకు మాత్రము తోటి ప్రయాణికుల మధ్యఒత్తుకు పోయి నలిగింది. ఇబ్బంది పడుతున్న ఆ మహిళను అప్పటికే అటుగా కారులో వస్తున్న పెద్దదోర్నాల మండల పరిషత్ అధ్యక్షురాలు గుమ్మ పద్మజ భర్త గుమ్మ ఎల్లేసు తనకారులో ఆమెను తరలించుకుని చింతల ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి తన ఔదార్యాన్ని చూపించి ఆదుకున్నారు. ఆమె వైద్య సేవలు పొందాక ఉపశమనం చెందింది. ప్రకాశం జిల్లా కొమరోలు మండలానికి చెందినవీరు కారులో శ్రీశైలానికి వెళుతుండగా అటువైపు నుండి శివదీక్ష స్వాములకారు వేగముగా వచ్చినట్లు ప్రయాణికులు తెలిపారు. దీంతో ఒకదానికోకటి ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తు ఎవరికి ఎటువంటి గాయాలు రాలేదు. ప్రాణాపాయం తప్పింది. కారు ముందు భాగం మాత్రం నుజ్జునుజ్జయింది. శ్రీశైలం ఘాట్ రోడ్ లో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పెద్ద దోర్నాల పోలీసులు హుటాహుటిన సంఘటనస్థలానికి చేరుకొని ట్రాఫిక్ పునరుద్ధరించారు.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

విశాలాంధ్ర-అర్ధవీడు : మండలంలోని 15గ్రామపంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనట్లు ఎంపీడీవో వీరభద్రచారి తెలిపారు. పంచాయతీల వారీగా నిధుల వివరాలు లక్షలలో ఇలా వున్నాయి. అర్ధవీడు 12,58,397, అయ్యవారిపల్లి 2,31,835,బొల్లుపల్లి 7,05,633, బోగోలు 2,76,839 దొనకొండ 5,62,566 గన్నేపల్లి 3,63,670 కాకర్ల 7,093, మాగుటూరు8,02,658, మొహిద్దిన్ పురం 4,81,677, నాగులవరం 6,40,215, పాపినేనిపల్లి 11,60704, పెద్ద కందుకూరు 4,51,362, రంగాపురం 3,84,504 వెలగలపాయ 3,13,500 యాచవరం 5,17,911 గ్రామాలకు నిధులు విడుదలైనట్లు ఈనిధులను తాగునీరు,శానిటేషన్, గ్రామపంచాయతీ విద్యుత్ బిల్లులు, క్లాఫ్ మిత్ర వేతనాలు, స్థానిక సమస్యల కొరకు వినియోగించుకోవాలని తెలిపారు.

దివ్యాంగుల కార్యవర్గం

విశాలాంధ్ర-కనిగిరి : నియోజకవర్గ దివ్యాంగుల కమిటీ ఎన్నిక సోమవారం నీలకంఠం వారి వీధిలో గూగుల్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్లో శ్రీ సాయి కృష్ణ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యర్యంలో జరిగింది. ఈ సమావేశంలో దివ్యాంగుల సామాజిక ఆర్థిక స్థితిగతులతో పాటు దివ్యాంగుల సమస్యలను దోసపాటి నరసయ్య సమావేశంలో వివరించారు. కనిగిరి నియోజకవర్గం అధ్యక్షులుగా షేక్. ఖాజా ఫీర్, ఉపాధ్యక్షులుగా చీరాల మాలాద్రి,కోశాధికారిగా షేక్ బషీరా, కార్యదర్శిగా యం.మాల్యాద్రి, ఉప కార్యదర్శిగా షేక్ ఖాసింబి, సభ్యులుగా కాకర్ల మాధవి, గౌరవ సలహాదారుడు ఎలమందయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శ్రీ సాయి కృష్ణ సంక్షేమ సంఘం అధ్యక్షులు దోసపాటిన నరసయ్య వివరించారు. మద్దిశెట్టి భారతి, షేక్ నాగురిబీ, రెడ్డి. సంధ్య, రమాదేవి పాల్గొన్నారు.

Notice
IN THE COURT OF THE HON'BLE 1st ADDL. DIST. JUDGE:: GUNTUR
M.V.O.P.No: 211/ 2021
Between:
Tammaluri Prabhudas and Others - Petitioners
And
Gali Mariya Kumar & Others - Respondents
To,
R-1:: Narasaiah Tiruvayipathi,
S/o. Nambelah, R/o.Door No:3-179, West Veerayapalem, Kurichudu-Prakasam Dist-523304.
(Owner of the Auto bearing No: AP 27 TW 0208)
పై నెంబరు **O.P.**లోని పిటిషనర్లు యాక్సిడెంటుకు నష్టపరిహారము కోరుచూ పిటిషన్ దాఖలు చేయగా సదరు **O.P.** లో 1వ రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకోనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది: 28-11-2022 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున **ఉ.గం. 10-30** ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకోనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది: 28-11-2022
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
టి.కోటేశ్వరరావు, ఆర్.శ్రీ చరణి, పిటీషనర్ల తరపు అడ్వకేట్స్, గుంటూరు,
సెల్:8978450600

ఒప్పందపత్రం తరువాతే మొక్క జొన్న పైరు సాగుచేయాలి

విశాలాంధ్ర-అర్ధవీడు : మండలంలోని అంకభూపాలెంలో సాగవుతున్న మొక్క జొన్న పైరును మండల వ్యవసాయాధికారి ఎస్కె మహమద్ సోమవారం పరిశీలించారు. అధీకృత విత్తన కంపెనీల నుండి ఒప్పంద పత్రం తీసుకున్న తరువాతే మొక్క జొన్న సాగు చేయాలనీ రైతులకు సూచించారు. విత్తన బ్యాగులు పంట చివరి వరకు దాచుకోవాలని వివరించారు. ఒకే రకం విత్తనం పక్కపక్కనే నాటుకోవాలని తెలిపారు. ఇతర రకాలను కొంత సమయం తీసుకున్న తరువాత విత్తుకోవాలని సూచించారు. ఆర్గనైజర్లు అధీక ృత కంపెనీ విధానాలనే రైతులకు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాపినేనిపల్లి వీఏఏ ఇమ్రాన్ పాల్గొన్నారు.

దద్దల రాములుకు 'చింతలచెరువు' పరామర్శ

విశాలాంధ్ర-కనిగిరి : ఏఎంసి డైరెక్టర్ , ప్రముఖ రియాల్టర్ వైసిపి నాయకులు దద్దల రాములును సోమవారం ఆంధ్రప్రదేశ్ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి పరామర్శించారు. ఇటీవల దద్దాల రాములు గుండె శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో పలువురు వైసిపి నాయకులతో కలిసి చింతలచెరువు మాట్లాడారు. శీతాకాలంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వీరం రెడ్డి బ్రహ్మారెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇప్పడైనా కాల్వలు శుభ్రం చేయాలి..

విశాలాంధ్ర-తెనాలి : వరికోతలకు సిద్ధమవుతున్న తరుణంలోనైనా పంట కాల్వలు, మురుగు కాల్వల్లో గల తూటాకు, వగైరాలను తొలగించాలని ఆంధ్రప్ర దేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి అధికారులను కోరారు. సోమవారం అంగలకుదురు, గుడివాడ, కంచర్లపాలెం, తేలప్రోలు గ్రామాల్లో రైతు సంఘం ప్రతినిధి బృందం మురుగు, పంట కాల్వలను పరిశీలించి, రైతులు ఎదుర్కొం టున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 15-20 రోజుల్లో వరి కోతలు రానున్నాయని, విత్తనాలు చల్లేందుకు భూమి సిద్ధం చేసే క్రమంలో చేలల్లో నీరు బయటకు వెళ్లే పరిస్థితి కనబడటం లేదన్నారు. దుగ్గిరాల, తెనాలి మండలాల్లో ప్రవహించే డిఆర్‌బిసి, నందివెలుగు, కంచర్లపాలెం, తేలప్రోలు, మీదుగా బుర్రిపాలెం వెళ్లే పంట కాల్వలు తూటాకు, గుర్రపు డెక్కతో పూడుకు పోయాయని రైతులు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో మందులు పిచికారి చేయించాలని గాని, పూర్తిగా తొలగించకపోవడం వలన చేల్లో నీరు ఎగదన్ని పంట నష్టం జరిగే అవకాశం ఉందని కోపల్లె రైతు యర్రంనేని సాంబశివరావు, గుడివాడ రైతు కొలకలూరి బాబురావు, తేలప్రోలు మాజీ సర్పంచ్ వేజండ్ల రోశయ్య ఆవేదన వ్యక్తపరిచారు. అధికారులు సమస్య తీవ్రతను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొలకలూరి రాజు, మురికి జోజప్ప, బుస్సా బాబురావు, వి.ఫణి, కోపల్లె రవి కింగ్, కొలకలూరి బాబురావులు పాల్గొన్నారు.

సీపీఐ నియోజకవర్గ సమావేశంలో జంగాల



విశాలాంధ్ర-ప్రత్తిపాడు : ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యకర్తల సమీక్షా సమావేశంలో సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేడా హనుమంతరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు, సహాయ కార్యదర్శి అమరలింగేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి దీక్షను విజయవంతం చేయాలి: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు : అమరావతినే రాష్ట్ర ఏకైక రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న కలెక్టర్ వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చేయతలపెట్టిన దీక్షలో గుంటూరు నగరంలోని పార్టీ శ్రేణులు, అమరావతి రాజధానిని కాంక్షించే ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. స్థానిక సంద్ర రాజేశ్వరరావు నగర్ కార్యదర్శుల సమావేశం సోమ వారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ సీఆర్‌డీఏ చట్ట సవరణ ఉపసంహరించుకోవాలని, రాజధానిలో ఇళ్ల స్థలాల పేరిట ముఖ్యమంత్రి చేస్తున్న అమరావతి రాజధాని విచ్ఛిన్నకర వైఖరి విడనాడా లని తదితర అంశాలపై ఈ దీక్ష జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కమిటీ సభ్యులు దేవనాయక్, విజయ్, సుభాష్ చంద్రబోస్, హుస్సేన్ బి, ముత్తుజ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ స్వరూపాన్ని మార్చిన అక్టోబర్ విప్లవం: ఓబులేసు

విశాలాంధ్ర- ఒంగోలు: భౌతిక పరిస్థితులకు అనుగుణంగా పోరాటాలలో మార్పులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని , 1917 నాటి అక్టోబర్ విప్లవం ప్రపంచ స్వరూపాన్ని మార్చివేసిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ ఓబులేసు అన్నారు. ఒంగోలు మల్లయ్య లింగం భవనములు సోమవారం సైంటిఫిక్ సోషలిస్టు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మహత్తర అక్టోబర్ విప్లవ 105వ వార్షికోత్సవ సందర్భంగా అక్టోబర్ సోషలిస్టు విప్లవం సమకాలీన ప్రపంచం అనే అంశంపై స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ విప్లవం సరికొత్త యుగాన్ని సృష్టించటం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. రష్యాలో నాటి జారస్టు దోపిడీ వ్యవస్థను రద్దు చేసి దాని స్థానంలో మానవునిపై మరోక మానవుడు దోపిడీ లేనటువంటి కార్మిక, కర్షక రైతాంగ రాజ్యాన్ని నెలకొల్పిందన్నారు.

చరిత్రలో ఈ విప్లవం మొదటి సారి దోపిడీ, వలసవాదాన్ని, సామ్రాజ్య వాద వ్యవస్థను బద్దలు కొట్టిందన్నారు. సోషలిస్టు వ్యవస్థను దెబ్బతీసేందుకు అనేక ప్రయత్నాలు జరిగినప్పటికీ రష్యన్ విప్లవం ప్రపంచ వ్యాపితంగా కార్మిక వర్గానికి, శ్రమజీవులకు, విముక్తి ఉద్యమాలకు ఎంతో ఉత్తేజాన్ని ఇచ్చిందన్నారు. భారత దేశంతో పాటుగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు ప్రజల పోరాటాలకు రష్యన్ విప్లవం బాసటగా నిలిచిందన్నారు. భారత దేశ స్వాతంత్ర్య పోరాటానికి, నాటి సోవియేట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందన్నారు. స్వాతంత్రోద్యమానికి అన్ని విధాలా సహకరించిందన్నారు. స్వాతంత్రానంతరం దేశ ఆర్థిక పరిస్థితి, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివృద్ధికి బహుముఖంగా తోడ్పడిందన్నారు. అటువంటి అక్టోబర్ విప్లవం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సోషలిస్టు సమాజం దిశగా పోరాటాలు సాగించాలన్నారు.

ఈ కార్యక్రమంలో మార్క్సిస్టు తత్వశాస్త్ర అర్థశాస్త్ర విశ్లేషకులు బి తులసేంద్ర,సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, డిహెచ్‌పిఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు,కమ్యూనిజం పత్రిక ఎడిటర్ ఎంసీ వెంకటేశ్వర్లు,సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు, ఒంగోలు నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి, శాస్త్రీయ సామ్యవాద అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఎం వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమాలకు ఉత్తేజం...

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల

విశాలాంధ్ర-గుంటూరు : కామ్రేడ్ వి.ఐ.లెనిన్ ఆధ్వర్యంలో విప్లవం ద్వారా నూతన సోషలిస్టు వ్యవస్థను స్థాపించారని, ఈ విప్లవం ప్రపంచ స్వరూప స్వభావాన్ని మార్చివేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ అన్నారు. సీపీఐ నగర సమితి ఆధ్వ ర్యంలో గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లోని వీఎస్‌కే హాలులో 'నేటి ప్రపంచీకరణ నేప థ్యంలో అక్టోబర్ మహా విప్లవం ఆవశ్యకత' అనే అంశంపై సోమవారం సదస్సు జరిగింది. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జంగాల మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదుల గుండెల్లో గుబులు పుట్టించి దేశంతో పాటు చాలా దేశాల్లో విముక్తి ఉద్యమాలకు, స్వాతంత్ర్యోద్యమాలకు అక్టోబర్ సోషలిస్టు విప్లవం ఉత్తేజాన్ని ఇచ్చిందని అన్నారు. దేశం స్వావలంబన దిశగా ప్రయాణించడానికి అనేక విధాలుగా సోవియట్ సోషలిస్టు విప్లవం ఆదుకుం దని తెలిపారు. చాలా దేశాల్లో దేశభక్తియుత శక్తులకు ప్రేరణగా సోషలిస్టు విప్లవం నిలిచిందని వివరిం చారు. నేడు ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ కంపె నీలకు పాలక ప్రభుత్వాలు ఊడిగం చేస్తున్నా యని, పెట్టుబడిదారీ విధానాలను అమలు చేస్తు న్న ప్రభుత్వాలు, దేశాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్న ఈ స్థితిలో సోషలిజమే సమస్యలకు సరైన పరిష్కారమని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజి బాబు, చల్లా మరియదాస్, సీహెచ్ విజయ్ కుమార్ పాల్గొనగా, సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వర్లు ప్రసంగించి సదస్సును ముగించారు.

మెటల్, గ్రావెల్ తరలిస్తున్న లారీల సీజ్

విశాలాంధ్ర-ఫిరంగిపురం: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్, మెటల్‌ను తరలిస్తున్న నాలుగు టిప్పర్ హెవీ లారీలను సీజ్ చేసినట్లు మైనింగ్ విజిలెన్స్ అధికారి కొండారెడ్డి సోమవారం తెలిపారు. సమాచారం తెలుసుకున్న మైనింగ్ విజిలెన్స్ అధికారులు ఫిరంగిపురంలో తనిఖీలు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ లోడు లారీ ఒకటి, మెటల్ లోడుతో వెళ్తున్న మూడు లారీలకు ప్రభుత్వ అనుమతి పత్రాలు లేని కారణంగా సీజ్ చేసి పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు మైనింగ్ విజిలెన్స్ అధికారి తెలిపారు. దీంతో అక్రమంగా గ్రావెల్, మెటల్ తరలిస్తున్న వ్యక్తులు ఉలిక్కిపడ్డారు.



అధికారులపై ప్రజల ఆగ్రహం..

మండలంలో సంవత్సరాలు తరబడి అక్రమంగా గ్రావెల్, మెటల్ తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకుండా మామూళ్ల మత్తులో జోగుతున్నారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. రెండేళ్లుగా ఫిరంగిపురం క్వారీల నుంచి రాత్రి, పగలు సామర్ధ్యానికి మించి గ్రావెల్, మెటల్ తరలిస్తూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నా పట్టించుకునే నాధుడు కరువయ్యాడని చర్చించుకుంటున్నారు. ప్రసిద్ధి చెందిన పుణ్య క్షేత్రమైన ఫిరంగిపురం కార్మెల్‌మాత కొండను కొల్లగొట్టేస్తున్నా చర్యలు తీసుకోకుండా అధికారులు చూచి చూడనట్లుగా ఉన్నారని ఫిరంగిపురం ప్రజలు మండిపడుతున్నారు. బ్లాస్టింగ్ ప్రకంపనలకు ఫిరంగి పురం కొండకు సమీపంలో ఉన్న చుట్టు ప్రక్కల నివాస ప్రజలు తమ గృహాలు దద్దరిల్లి బీటలు వారుతున్నాయని, పేలుళ్లతో బెంబేలెత్తుతున్నామని ప్రజలు వాపోతున్నారు. రాత్రి సమయంలో మెటల్ తరలిస్తున్న లారీల శబ్దాలకు నిద్రలేదని సమస్యలను స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోలేదని వాపోతున్నారు. గ్రావెల్, మెటల్ తవ్వకాలపై తనిఖీలు చేయాల్సిన అధికారులు జాడ లేకపోవ డంతో ఫిరంగిపురం ఆస్తులకు గండిపడుతుందని మరికొందరు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

చిత్తశుద్ధితో హామీలను అమలు చేస్తున్నాం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-తెనాలి : ఎన్నికల హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి నుంచి ఎమ్మెల్యేగా తన వరకు వాటిని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్ అన్నారు. ఇళ్ల నిర్మాణాలపై మున్సిపల్ కార్యాలయంలో సోమవారం అధికారులు, ఇళ్ళ నిర్మాణాల కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వలేని విధంగా వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క తెనాలిలోనే 27వేల మందికి నివేశన స్థలాలు ఇచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. పేదలకు స్థలాలు ఇచ్చిన జగనన్న కాలనీల్లో వచ్చే ఆరు నెలల్లో పూర్తి స్థాయిలో ఇళ్లను నిర్మించేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఇప్పటికే పెదరా వూరులో 80శాతం గృహాలకు స్లాబులు వేశారని, పూర్తయిన కొన్ని ఇళ్లల్లో లబ్ధిదారులు నివాసం ఉంటున్నారని ఆయన తెలిపారు.

వార్డుల వారీగా లబ్ధిదారులతో కూడా వచ్చే వారం సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం 840మందికి ఇచ్చే టిడ్కో ఇళ్లను అయిదేళ్లలో నిర్మించారని తెలిపారు.

తాను కేవలం మూడేళ్లల్లో 27వేల మందికి నివేశన స్థలాలు ఇచ్చి, వాటిని పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరిగేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలు వాస్తవాలు గమనించాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, మున్సిపల్ కమీషనర్ ఎం.జస్వంతరావు, హౌసింగ్ ఈఈ భాస్కరరావు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు వైఎస్సార్ విగ్రహం తొలగింపు



విశాలాంధ్ర-తాడేపల్లి : ఇప్పటం గ్రామంలో వైఎస్సార్ విగ్రహన్ని అధికారులు సోమవారం క్రేన్ సాయంతో విగ్రహం అక్కడ నుంచి తీసి వేరో చోటికి తరలిం చారు. ఇటీవల రోడ్డు విస్తరణ పేరుతో ఇప్పటం గ్రామంలో అధికారులు ఇళ్లలను కూలగొట్టారు. గాంధీ, నెహ్రూ వంటి మహానుభావుల విగ్రహాలు తొలగించారు. ఇటీవల ఇళ్ల కూల్చివేతపై గ్రామంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పర్యటించారు. గ్రామస్తులను పరామర్శించారు. రోడ్డు మీదకు ఉన్న వైఎస్ విగ్రహం ఎందుకు తొలగించలేదని పవన్ కళ్యాణ్ ప్రశ్నించారు. ముళ్ల కంచెల ద్వారా విగ్రహానికి పోలీసు బందోబస్తుపై విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియాలోనూ ప్రభుత్వంపై సెటైర్లు వేశారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు సోమవారం వైఎస్ విగ్రహం తొలిగించారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

విశాలాంధ్ర-గిద్దలూరు : చిన్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించి వారి పెరుగుదలకు తోడ్పడి శిశు మరణాలు తగ్గించాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ బి మేరిసారా దానమ్మ అన్నారు.శిశు సంరక్షణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అర్బన్ కాలనీ సచివాలయంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తమకు పుట్టబోయే శిశువు అంగవైకల్యం లేకుండా ఆరోగ్యంగా జన్మిస్తారని ఆమె అన్నారు. కావున ప్రతి గర్భిణి మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని, అలాగే సంవత్సరంలోపు పిల్లలకు కూడా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఏం పిచ్చయ్య యాదవ్, ప్రియదర్శిని, ప్రభుత్వ వైద్యాధికారి దీపిక మంజూష, కోర్టు సిబ్బంది వరలక్ష్మి, ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన ఆశ్రమంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

విశాలాంధ్ర-గిద్దలూరు : నగర పంచాయతీ పరిధిలోని చెట్టిరెడ్డిపల్లి గ్రామంలో శ్రీ కాశినాయన ఆశ్రమంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు మార్తాలా సుబ్బారెడ్డి, కొమ్మునూరు సర్పంచ్ కర్నాటి రామసుబ్బారెడ్డి, మండ్ల రంగనాయకులు, కంచర్ల కిరణ్, పలువురు టిడిపి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'స్పందన'కు 38 ఫిర్యాదులు

విశాలాంధ్ర-గుంటూరు : నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 38 ఫిర్యాదులు అందాయని అదనపు కమిషనర్ పి.రోజా తెలిపారు. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 12, ఇంజనీరింగ్ విభాగం 10, ప్రజారోగ్య విభాగం 9, ఉపా సెల్ 1 ఫిర్యాదులు ఉన్నట్లు వివరించారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ సోమవారం కమిషనర్ ఛాంబర్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా సమగ్రంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఎటువంటి అలసత్వం వహించవద్దని, నిర్దేశిత గడువులోగా ఫిర్యాదులు, అర్జీలు పరిష్కరించాల్సిన బాధ్యత విభాగాధిపతిదేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ బి.శ్రీనివాసరావు, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, సీఎంఓహెచ్ డాక్టర్ విజయ లక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకులు కామినేని భాస్కర్ రావు కన్నుమూత

విశాలాంధ్ర-దుగ్గిరాల : మంగళగిరి నియోజకవర్గ సీపీఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ కామినేని భాస్కరరావు(94) సోమవారం తుమ్మపూడి గ్రామం లో తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ భాస్కర రావు మృతదేహంపై పార్టీ పతాకాన్ని కప్పి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాస్కర్ రావు గత 70 సంవత్సరాల నుంచి పార్టీలో జండా మోస్తూ అలు పెరుగని పోరాటాలు చేశారని, ప్రతి విషయంలో నాయకుడై నడిపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, తుమ్మపూడి గ్రామ కార్యదర్శి షేక్ కరిముల్లా, నాయకులు యార్లగడ్డ శివయ్య, జవ్వాది సాంబశివరావు, షేక్ జాన్ సైదా తదితరులు నివాళులర్పించారు.

ఆచార్య ఎన్జీ రంగకు నివాళి

విశాలాంధ్ర-పొన్నూరు : రైతు బాంధవుడు, స్వాతంత్ర సమరయోధుడు, జాతీయ వాది, పార్లమెంట్ సభ్యుడు, రైతు నాయకుడు, రైతాంగ ఉద్యమపితగా పిలవబడే ఆచార్య గోగినేని రంగనాయకులు జయంతి సందర్భంగా పొన్నూరు పట్టణంలోని జీబీసీ రోడ్డు వద్ద ఉన్న ఎన్జీ రంగ భారతీ దేవి స్ఫూర్తి నిలయం వద్ద జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అడపా మాణిక్యాలరావు, అప్పారావు, సూర్య, చందు, తన్నీరు గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

79వ రోజుకు అన్న క్యాంటీన్



విశాలాంధ్ర-తాడేపల్లి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు మారుతి ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షులు జంగాల సాంబశివరావు ఆధ్వర్యంలో అన్న క్యాంటిన్‌లో సోమవారం భోజనం ఏర్పాటు చేశారు. తాడేపల్లి నులకపేటలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్ సోమవారం 79వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జంగాల సాంబశివరావు మాట్లాడుతూ నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలో అనేక మంచి సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లు, సంజీవని ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు వంటి అనేక మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ రాష్ట్ర బీసీల అధికార ప్రతినిధి దానబోయిన సుందర్రావు యాదవ్ మాట్లాడుతూ లోకేష్ ఆదేశాల మేరకు జంగాల సాంబశివరావు తన సొంత ఖర్చులతో అన్న క్యాంటీన్‌లో నెలకి ఐదు రోజులు భోజనం అందజేయడం శుభపరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు లీలా కృష్ణ, పెద్ది రాజు, శ్రీను, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.